వాళ్ళకి చాలా గమ్మత్తుగా అనిపించింది. అనుకోకుండా వాళ్ళు నాగరాజు ఫోటోని సుబ్బలక్ష్మి ఫోటోతో కలిపారు.

విధి విలాసం అంటే ఇదేకదా?.....' అన్నాడు కిష్టయ్య ఆశ్చర్యంగా ముక్కున వేలేస్కుంటూ.

రాంబాబు చికాకుగా కిష్టయ్య వంక చూశాడు.

"రాత్రి సెకండ్ షో సినిమా కెళ్ళా గురూగారూ..... అందులో కూడా విధిలీలలు ఇలానే ఉంటాయ్.....' అని అంటూ ఒక్కసారిగా కెవ్వుమన్నాడు. "గురూగారూ.... ఆమె......'

రాంబాబు కూడా కంగారుపడ్డాడు. సుబ్బలక్ష్మి మళ్ళీ నదివైపు పరుగులు తీయసాగింది. రాంబాబూ కిష్టయ్యా మళ్ళీ వెంబడించి సుబ్బలక్ష్మిని పట్టుకున్నారు.

"నన్ను వదలండి ..... నన్ను చేసుకోవడం మీకు ఇష్టంలేదని ఈ పెళ్ళి తప్పించినా నా పెళ్ళి నాగరాజుతో జరగదు కదా?.....' అంది సుబ్బలక్ష్మి నదివైపే చూస్తూ.

నాగరాజుతో పెళ్ళి జరిపించే బాధ్యత నాదని రాంబాబు సుబ్బలక్ష్మికి మాటిచ్చి ఇంటికి పంపించేశాడు.

నాగరాజుకి పాయింట్ దొరికింది!!

నాగరాజుకి పాయింట్ దొరికింది.

"హు.....ప్చ్.....' విసురుగా తల విదిలించాడు నాగరాజు.

అతను అప్పటికి అలా ఒక వందసారులైన తల విదిలించాడు.

నాగరాజుకి తలచుకుంటున్నకొద్దీ పరమ ఉక్రోషంగా, బాధగా, కోపంగా అన్ని రకాలుగా ఉంది.

అందమైన సరోజ తనది అవుతుందని అనుకున్నాడు. రాజశేఖరావుకి తనంటే యిష్టమే.... హఠాత్తుగా కథ ఇలా అడ్డం తిరుగుతుందని నాగరాజు ఊహించలేదు.

రాజశేఖరావుకి కూతురంటే చాలా ప్రేమ, తన ఆస్థిని కూతురికీ, కొడుకుకీ సగం సగం పంచి ఇస్తాడు. సరోజ తనది అయిదంటే సగం ఆస్థికుడా తనకే దక్కి ఉండేది. ఇటు సరోజ దక్కలేదు అటు సుబ్బలక్ష్మి తనకి దూరం అయ్యింది.

"ప్చ్..... హు..... ' మళ్ళీ తల విదిలించాడు నాగరాజు.

దీనికంతకూ కారణం రాంబాబే..... వాడిని ఇప్పుడే స్టూడియోకి వెళ్ళిబెదిరిసే? సరోజ నుండి దూరంగా తప్పుకో...... లేకపోతే నీపని ఖాళీ అని చెప్తేనో?.....

చిక్కడపల్లి వైపు అడుగులు వేశాడు నాగరాజు. ఒక పదినిమిషాలు నడిచిన తరువాత ఇస్మైలు ప్లీజ్ ఫోటో స్టూడియో చేరుకున్నాడు నాగరాజు. స్టూడియో తాళం వేసి ఉంది.

"ప్చ్.....హు.....' తల విదిలించి ముందుకు అడుగులు వేశాడు నాగరాజు.

అలా మెల్లగా కాళ్ళీడ్చుకుంటు కాస్తదూరం నడిచాడు నాగరాజు.

"ఒరేయ్ నాగూ.....' ఎవరో పిలిచారు.

పక్కకి తిరిగి చూశాడు నాగరాజు.

నాగరాజు స్నేహితుడు సంకర్రావు "నవ్వుతూ దగ్గరికి వచ్చాడు.'

"ఏంటోయ్ సంగతులు?.....' అంటు పలక్రించాడు శంకర్రావు.

"ప్చ్.....హ..... ఏముంటాయ్లే' అన్నాడు నాగరాజు.

"ఎలా ఉన్నావ్?'

"ప్చ్.....హు....ఏం ఉండడమోలే.....'

"ఏంటీ మధ్య బొత్తిగా కనిపించడంలే....'

"ఏంటి చాలా డల్గా ఉన్నావ్?'

"ప్చ్....హు.....' బాధగా తల విదిలిస్తూ అన్నాడు నాగరాజు.

శంకర్రావు జాలిగా నాగరాజు వంక చూశాడు.

"నీ బాధా అర్థం చేసుకోగలనులే.... ప్రేమించిన అమ్మాయికి పెళ్ళయిపోతూ ఉంటే ఎవరికైనా బాధగానే ఉంటుంది అన్నాడు.

నాగరాజు ఉలిక్కి పడ్డాడు.

"సరోజ పెళ్ళా?.... ఎప్పుడు!' కంగారుగా అడిగాడు శంకర్రావుని.

సంకర్రావు ఆశ్చర్యంగా చూశాడు.

"సరోజా?....సరోజెవరు?....నేను మాట్లాడుతున్నది సుబ్బలక్ష్మి గురించి.'

నాగరాజు కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయ్.

"సుబ్బలక్ష్మి పెళ్లా?....నీకెవరు చెప్పారు?'

"మొన్ననే తాడేపల్లి గూడెం వెళ్లాను.... మా అమ్మకి ఒంట్లో బాగోలేదని ఉత్తరం వస్తే చూడడానికి వెళ్ళాను. సుబ్బలక్ష్మి వాళ్ళ ఇల్లు మా ఇంటిపక్కనే కదా.... నేను వెళ్ళినరోజే సుబ్బలక్ష్మికి పెళ్ళిచూపులు జరిగాయ్.....సంబంధం కుదిరినట్టే అంటున్నారు....'

"ప్చ్ .....హు.....' బాధగా తల విదిలించాడు నాగరాజు. సరోజ దక్కలేదు ..... కనీసం సుబ్బలక్ష్మికూడా దక్కలేదు.....

"ఇంతకీ పెళ్ళికొడుకు ఎవరు?'

"రాంబాబు అనీ .... తాడేపల్లివాడేగూడెం..... ప్రస్తుతం హైదరావాద్ లోనేఉంటున్నాడు.'

"రాంబాబు ..... ఏం చేస్తుంటాడతను?' గబగబా అడిగాడు నాగరాజు.

"ఇక్కడే చిక్కడపల్లిలో ఫోటోస్టూడియో ఏదో ఉందట!.....'

నాగరాజు సంతోషంతో విజిలేశడు.

సరోజకి కష్టమొచ్చింది

భీమేశ్వరరావు తలదువ్వుకుని షూస్ తీసి కాళ్ళకి తొడుక్కోసాగాడు.

"బయటి కెక్కెడకైనా వెళుతున్నావా?' సరోజ అన్నయ్యని అడిగింది.

"అవును .....ఏం ?' అన్నాడు భీమేశ్వరరావు లేసుముళ్ళు వేసి సోఫాలోంచి లేచి నిలబడ్తూ.

"ఏవైపు వెళుతున్నావ్?'

"చిక్కడపల్లి వైపు.'

"ఒరేయ్ అన్నయ్యా .... చిన్నసాయం చేసిపెట్రా'

"ఏంటి?'

"చిక్కడపల్లిలో ఒక ఫోటోస్టూడియో కార్డు ఇస్తాను.... దాన్నిపట్టికెళ్ళి ఫోటోలు తీసుకురారా..... డెవలప్‌చేసి ప్రింట్స్ వేసిమ్మని ఒక రోల్ ఇచ్చాను వాడికి.....'

"అలాగే.....'

సరోజ లోపలికి వెళ్లి కార్డు తెచ్చి ఇచ్చింది.

'అలాగే ఇస్మైల్‌ప్లేజ్ ఫోటో స్టూడియోకి వెళ్ళి రాంబాబు ఉన్నాడేమో చూడు.....'

'అలాగే.....'

టీ షర్టులోంచి కనబడే తన కండల్ని ఒకసారి చూసుకుని బయటికి వెళ్లాడు భీమేశ్వరరావు.

భీమేశ్వరరావు వెళ్ళిన తరువాత సరోజ హాల్లో కూర్చుని నవలేదో చదువుకోసాగింది. కాస్సేపయ్యాక ఫోన్ మోగింది.

ఫోన్ ఎత్తింది సరోజ.

'హలో .....' అంది.

'హలో....' అంది అవతలి కంఠం. అది నాగరాజు గొంతు.

సరోజ వెంటనే ఫోన్ డిస్కనెక్ట్ చేసింది.

నవల తీసి రెండులైన్లు చదివిందోలేదో మళ్ళీ ఫోన్ మ్రోగింది.

'హలో.... సరోజా....నేను చెప్పేదివిను.....' నాగరాజు అవతల నుండి కంగారుగా అన్నాడు.

సరోజ ఫోన్ డిస్కనెక్ట్ చేసింది.

రెండు నిముషాల తరువాత మళ్ళీ ఫోన్ మోగింది.

సరోజ కోపంగా రిసీవర్ ఎత్తింది.

'నువ్వేం చెప్పినా వినదల్చుకోలేదు...నువ్వంటే నాకు అసహ్యం' అని రిసీవరు పెట్టెయ్యబోయింది.

అవతలనుండి 'హలో....' అంటూ అయోమయంగా వినిపించింది.

అది రాంబాబు గొంతు.

సరోజ సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యింది.

'హలో రాంబాబూ .... నువ్వా?..... సారీ మాబావ ఫోన్‌చేశాడను కొన్నాను....ఎక్కడినుండి?......'

'ఇంటి దగ్గరనుండి ఫోన్ చేస్తున్నాను.....'

'అవునూ నువ్వు ఊరెళ్ళావా?'

'అవును.....మా ఊరు తాడేపల్లిగూడెం వెళ్ళాను .... ఇప్పుడే ఊర్నుండి వచ్చాను......'

'ఏంటి చేప్పాపెట్టకుండా అంత అర్జంటుగా ఊరెళ్ళావ్?.....'

'సాయంత్రం ఇందిరా పార్కుకిరా ..... అన్ని విషయాలూ చెప్తాను'

'ఇంకా విశేషాలు ఏంటి?' కుతూహలంగా అడిగింది సరోజ.

విసుగ్గా కళ్ళు చిట్లించి ఫోన్ పెట్టేసింది సరోజ.

ఒక నిముషం తరువాత ఫోన్ మళ్ళీ మోగింది.

చటుక్కున ఫోన్ తీసింది సరోజ.

'సారీ..... ఫోన్ డిస్కనెక్ట్ అయ్యింది...... చెప్పుఏంటి విశేషాలు?' కులాసాగా అంది సరోజ.

'ఫోన్ డిస్కనెక్ట్ అయ్యిందా?...నేను నువ్వే డిస్కనెక్టు చేస్తున్నావని అనుకున్నాను.... విశేషం చెప్పడానికే ఫోన్ చేశాను.....'

ఆ మాట్లాడింది రాంబాబు కాదు..... నాగరాజు!

'నువ్వా?.... హు.....' మళ్లీ ఫోన్ డిస్కనెక్టు చేసింది సరోజ.

పది సెకన్లకి ఫోన్ మళ్ళీ మోగింది.

ఫోన్ ఎత్తకుండా కాస్సేపు చూసింది సరోజ.

ఫోన్ చేస్తుంది ఒకవేళ రాంబాబేమో?'

ఆ ఆలోచన రాగానే వెంటనే ఫోన్ ఎత్తింది.

హాలో.....

'హలో .... సరోజ దయచేసి ఫోన్ పెట్టేయ్యకు ...నీకు ఉపయోగించే విషయమే చెపతున్నాను..... నువ్వు ఘోరంగా మోసబోతున్నావ్..... నాగరాజు గబగబా చెప్పాడు.

'ఏంటా విషయం?' అసహనంగా అడిగింది సరోజ.

'రాంబాబు తాడేపల్లిగూడెం వెళ్ళాడు......'

'తాడేపల్లిగూడెం వెళ్ళాడు మళ్ళీ వచ్చేశాడు.'

'నీకెలా తెల్సు?'

'ఊర్నుండి ఇప్పుడే వచ్చాడు..... నాకు ఫోన్‌చేసి చెప్పాడు.'

'ఎందుకు వెళ్లాడో చెప్పాడా?'

'లేదు.... తరువాత చెప్తానని అన్నాడు'

'ఎందుకు చెప్తాడు ....చెపితే నువ్వు చెయ్యిజారి పోతావుగా..... పెళ్ళయ్యేదాకా నిన్న ఉపయోగించుకోవద్దూ?.... సరదాకి ఏ ప్రేమకావాలి..... కట్నంతో పెళ్ళి కావాలి!'

'ఏంటి నువ్వనేది?' సరోజ చేయి రిసీవర్ చుట్టూ బిగుసుకుంది.

'రాంబాబు తాడేపల్లిగూడెంకి పెళ్ళిచూపులకి వెళ్లాడు. బహుశా ఊరేళ్ళే ముందుకూడా

నీకు చెప్పిఉండడు. సంబంధం కుదిరిపోయినట్టే.... బాగా కట్నం ఇస్తున్నారట.....'

సరోజ చేతిలోంచి రిసీవర్ జారిపడబోయింది.

'నీకెవరు చెప్పారు?' నీరసంగా అడిగింది.

గూడెంలో పెళ్ళికూతురి ఇంటిపక్క ఇల్లు నాస్నేహితుడిది. వాడు అక్కడున్నప్పుడే ఈ పెళ్ళిచూపులు జరిగింది. నాకు ఇందాక బజార్లో కనిపించి చెప్పాడు.'

'నువ్వు చెప్పేదంతా నిజమేనా ?'

'నమ్మకం లేకపోతే ఆ రాంబాబునే అడిగి తెలుసుకోరాదూ?.... వాడు నువ్వు అనుకునేంత అమాయకుడు కాదు..... ఏనాటికైనా నీకు నేనే కావలసిన వాడిని.....'

నాగరాజు ఫోన్ డిస్కనెక్టు చేశాడు.

సరోజని చెప్పలేని నిస్సత్తువ ఆవహించింది.

నాగరాజు చెప్పింది నిజమేనా?.... అబద్ధం అయితే ఎంత బాగుండును?.....

మళ్ళీ ఫోన్ మోగింది.

ఫోన్ ఎత్తి 'హలో' అంది సరోజ.

'హలో ....నేనే సరోజా ..... ఇందాక ఫోన్ డిస్కనెక్టు అయ్యింది .... అన్నాడు రాంబాబు.

రాంబాబు గొంతు వింటూనే సరోజ టెన్షన్ ఫీలయ్యింది.

'రాంబాబూ..... నేనో విషయం అడగనా?' అంది.

'ఏంటి?'

'నువ్వు మీ ఊరు ఎందుకు వెళ్లావ్!'

'సాయంత్రం పార్కులో కలుస్తున్నాంగా ..... అప్పుడు చెప్తాను'

'పెళ్ళిచూపులకి వెళ్ళావ్కదూ?....'

'అరె .... నీకెలా తెల్సు?.... ఎవరు చెప్పారు?' రాంబాబు గొంతులో ఎక్సైట్మెంట్ వినిపించింది.

'యూ బీచ్ .... అయ్ హేట్యూ.....' గట్టిగా అరిచి సరోజ ఫోన్ డిస్కనెక్టు చేసింది.

కొన్నిక్షణాల తరువాత ఫోన్ మళ్ళీ మోగింది. ఎత్తకూడదని అనుకుంటూనే మనసులో ఏదో ఆశ పీకుతుంటే ఫోన్ ఎత్తింది సరోజ.

'సరోజా ప్లీజ్.... నేను చెప్పేది విను.....ఫోన్ డిస్కనెక్టు చేయకు.....మా నాన్నకి సీరియస్గా ఉందని టెలిగ్రాం వస్తే ఊరెళ్ళాను.... అంతేగాని నాకు పెళ్ళిచూపులని తెలీదు.... నాకు పెళ్లి యిష్టం లేదు....నిన్ను తప్పఎవరినీ చేసుకోను.... అంటూ జరిగిన విషయం మొత్తం సరోజకి వివరించాడు రాంబాబు.

'మరోగమ్మత్తు తెలుసా? ఆ అమ్మాయి ఎవరోకాదు....మీ బావ ఫోటోతో ఇంకో అమ్మాయి ఫోటో కలిపి కాపీ చేశామే.... ఆ అమ్మాయే అంతకంటే గమ్మతయిన విషయం ఏమిటంటే నాగరాజు ఆ అమ్మాయినే ప్రేమించి మోసం చేసింది.....'

సరోజ పకపక నవ్వింది.

'హమ్మయ్య నీ సందేహం తీరిపోయినట్టేగా? మరి సాయంత్రం మనం పార్కులో కలుస్తున్నాట్టేగా?....'

'ఊ....'

'సరిగ్గా సాయంత్రం ఆరింటికి నీకోసం పార్కులో ఎదురుచూస్తుంటాను.....'

'అలాగే.....బై' ఫోన్ డిస్కనెక్టు చేసింది సరోజ.

ఒక గంట తరువాత భీమేశ్వరరావు వచ్చాడు.

'ఇదిగో .... ఫోటోలు..... రాంబాబు స్టూడియో తాళం వేసుంది' ఫోటోల కవరు చేతికందించి లోపలికి వెళ్ళిపోయాడు భీమేశ్వరరావు.

సరోజ తన గదిలోకి వెళ్లి మంచంమీద కూర్చుంది.

కవర్లంచి ఫోటోలు తీసింది.

మొదటిఫోటో చూసింది.

అందమైన గులాబీలు .....ఎంత బాగా వచ్చిందో ఫోటో!! గులాబీ రేకుల మీద మంచు బిందువులు కూడా ఫోటోలో స్పష్టంగా పడ్డయి.

రెండో ఫోటో తీసింది.

పువ్వుమీద వాలువున్న రంగురగుల సీతాకోకచిలుక ఫోటో అది. ఆ ఫోటో కూడా చాలా బాగా వచ్చింది.

దాన్ని తీసి పక్కన పెట్టింది.

మూడో ఫోటో......

ఆ ఫోటో చూస్తునే సరోజ గుండె క్షణం పాటు ఆగింది. ఆమె కళ్ళు ఆశ్చర్యంగా విప్పారాయి. గుండె లయతప్పి కొట్టుకోసాగింది.

హఠాత్తుగా ఆమెకి దు:ఖం ముంచుకొచ్చింది. ఆమె తలగడమీద వాలిపోయింది. కన్నీళ్ళతో తలగడ తడిచింది.